ముంజెలతో ఉపాధి

- మండే ఎండల్లో మంచి ఉపశమనం
- రోడ్ల పక్కన విక్రయం
- పలువురికి జీవనోపాధి



గుండ్లపల్లె వద్ద రోడ్డు పక్కన తాటిముంజెలు విక్రయిస్తున్న దృశ్యం



ఐరాల : తాటి ముంజెలతో ఆరోగ్యం.. మండే ఎండలకు ఉపశమనం అనే విషయం తెలిసిందే. వేసవి కాలంలో వచ్చే ఆ ముంజెలు దాదాపు పదుల సంఖ్యలో కుటుంబాలకు ఉపాధి కల్పిస్తుండడం విశేషం. వేసవి ఎండల నుంచి ఉపశమనానికి మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరం ఈ తాటిముంజెలు. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధిని పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతు బిడ్డలకు మాత్రమే దొరికే ఈ తాటి ముంజెలు ప్రస్తుతం నగరం, పట్టణం, గ్రామీణ ప్రాంతాలతో నిమిత్తం లేకుండా పాదచారులకు దారిపొడవునా లభిస్తున్నాయి.

సీజన్‌లో ఇదే వృత్తి

మండలంలోని చెంగనపల్లెకు చెందిన పలువురు వేసవిలో తాటిముంజెలను ఆటోలో పీలేరు, తిరుపతి, మదనపల్లెకు వెళ్లి విక్రయిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. వీళ్లే కాక మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు తాటిముంజెలు రోడ్ల పక్కన విక్రయిస్తున్నారు. చెంగనపల్లెకు చెందిన అనేక మంది ఈ సీజన్‌లో ఇదే వృత్తిగా చేసుకుని జీవనం గడుపుతుంటారు. ఐరాల నుంచి చిత్తూరు వరకూ, పాటూరు నుంచి కల్లూరు వరకు రోడ్ల పక్కన ఈ తాటిముంజెలను విక్రయిస్తుంటారు. డజను ముంజెలను కవర్‌లో వేసి రూ.100కు విక్రయిస్తున్నారు. ఇక పల్లెల్లో అయితే సైకిళ్లపై ఇంటింటికీ తిరిగి మరీ విక్రయిస్తున్నారు.

రోజుకు రూ.వెయ్యి ఆదాయం

తాటిచెట్లు ఎక్కి తాటి కాయలను కోయడం ఒక ఎత్తు. వాటిని తీసుకువెళ్లి రోడ్ల పక్కన పెట్టి అమ్మడం మరోఎత్తు. తాటికాయలను పదునైన కత్తితో చాకచక్యంగా చెక్కి ముంజెలు జాగ్రత్తగా బయటకు తీయాలి. ఆ విధంగా తీసిన వాటిని 12(డజను) చొప్పున కవర్లలో వేసి విక్రయిస్తున్నాం. రోజుకు రూ.1000 పైబడి ఆదాయం వస్తుంది. కానీ చాకిరీ కూడా ఎక్కువే.

– వెంకటేష్, చెంగనపల్లె, ఐరాల

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

తవణంపల్లె: భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు టి.వి.నాగపద్మిణి తెలిపారు. మండలంలోని టి.పుత్తూరు సచివాలయంలో మంగళవారం పీఎం ప్రణామ్– భూసార ఆరోగ్య పరిరక్షణ పథకం కింద భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నాగపద్మిణి మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా పొలంలో ఏఏ రకం పంటలు సాగు చేయాలి? ఎరువులు ఎంత మోతాదులో వాడాలనే విషయాలు తెలుసుకుంటామన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. మట్టి నమూనా సేకరించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తొలకరి వర్షాలు పడినప్పుడు లోతైన దుక్కులు దున్నుకోవాలని సూచించారు. వేరుశనగ పంట సాగులో పాటించవలసిన మెలకువలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి జి.ప్రవీణ్ మాట్లాడుతూ పంటలు సాగు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులతో పాటు సేంద్రియ, జీవన ఎరువుల వాడకం గురించి వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను ఎలా సేకరించాలని, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిచంద్రారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి యోక్షేశ్వరి, తనుజకుమార్, ఆర్‌బీకే సిబ్బంది శ్రీధర్, లిఖిత పాల్గొన్నారు.



రోడ్డు నిర్మానుష్యం

రోజురోజుకూ ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో జనం ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఉదయం 11 గంటలకే మండలంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, తలపాగా, టోపీలు ధరించాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. – బంగారుపాళెం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అధినేతతో మాజీ ఎమ్మెల్యే



వైఎస్ జగన్‌ను కలిసిన సునీల్‌కుమార్

కాణిపాకం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలో మంగళవారం పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అధినేత దృష్టికి నియోజకవర్గంలోని కార్యకర్తల సమస్యలను తీసుకెళ్లారు. పరిహార విషయాన్ని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందనే విషయాన్ని గుర్తు చేశారని సునీల్‌కుమార్ వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్లు

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చిత్తూరులోని ఆర్‌వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గొల్లమడుగులో స్థానిక సర్పంచ్ వెంకిరెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసన్, ఆర్థో, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, డెంటల్‌కు సంబంధించి వైద్యులు వచ్చి రోగులకు చికిత్సలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. వైద్యశిబిరానికి 100 మందికి పైగా రోగులు హాజరయ్యారు. డాక్టర్లు కాలిద్, మోహిత్, గ్రీష్మ, పృథ్వి, క్సేవియర్, అంగన్‌వాడీ టీచర్లు కన్యాకుమారి, కవిత, బొమ్మసముద్రం వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్య అన్నదాన ట్రస్టుకు మంగళవారం రూ.లక్ష విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన దాత చంద్రారెడ్డి రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. ఆలయ సిబ్బంది కోదండపాణి ఆ నగదును అందుకుని విరాళం ఖాతాకు జమ చేశారు. అనంతరం దాత కుటుంబానికి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. పండితుల ఆశీర్వచనాలు, ప్రసాదం అందజేశారు.

లెనిన్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కామ్రేడ్ లెనిన్ 155 జయంతి సందర్భంగా మంగళవారం సీపీఐ కార్యాలయంలో చిత్రపటానికి పూలహారం వేసి నాయకులు నివాళులర్పించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ 1917లో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవానికి లెనిన్ సారథ్యం వహించారన్నారు. సోషలిస్టు సమాజ నిర్మాణానికి పునాదులు వేసిన నాయకుడని గుర్తు చేశారు. కార్మిక రాజ్యం కోసం కామ్రేడ్ కారల్‌మార్క్స్ సలహాలను తీసుకొని విప్లవబాటలో నడిచారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. నాయకులు కే.మణి, గోపీనాథ్, చంద్ర, రమాదేవి, విజయ్‌కుమార్, లతారెడ్డి పాల్గొన్నారు.

ఐషర్ వాహనం బోల్తా

గుడిపాల: చిత్తూరు–వేలూరు జాతీయ రహదారిలోని పానాటూరు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఐషర్ వాహనం బోల్తా పడింది. చిత్తూరు నుంచి వేలూరుకు బత్తాయి కాయల లోడ్‌తో ఐషర్ వాహనం బయల్దేరింది. డ్రైవర్ నిద్రమత్తులో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు ఏవీ రాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సీఎన్‌ఆర్ కళాశాలలో ధరిత్రి దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

గుడిపాల: మండల కేంద్రంలోని సీఎన్ఆర్ కళాశాలలో ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ మాట్లాడుతూ భూమిని కలుషితం చేయకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని చెప్పారు. భూమిమీద కొన్ని లక్షల జీవరాశులు నివసిస్తాయన్నారు. భూమిని కాపాడు, జీవితాన్ని కాపాడు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. భూమి మీద చెట్లను పెంచి ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వస్తువులు వాడడం వలన భూమి కలుషితమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి ఆరోగ్యకరమైన సమాజాన్ని స్థాపించాలని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్, అధ్యాపకులు రంజిత్‌కుమార్, జోయల్, కోదండన్, అనురాధ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌కు 30 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: బీఎస్ఎన్ఎల్ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని డీఈ సురేంద్రనాథ్ తెలిపారు. నగరంలోని ఆ శాఖ డివిజన్ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించారు. ఇందులో పలు ప్రాంతాల నుంచి వినియోగదారులు సమస్యలను అధికారులకు తెలియజేశారు. నెట్‌వర్క్ పరంగా 17, ఇంటర్‌నెట్ సేవలపై 5, బిల్లుల అంశంపై 6, ల్యాండ్ ల్యాన్‌కు సంబంధించి 2 ఫిర్యాదులు వచ్చినట్లు డీఈ తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రతాప్‌రెడ్డి, సురేష్, హిమగిరి, శ్రీనివాసులు, రామస్వామి, అశ్వత్‌కుమార్, రెడ్డెప్ప, హరికృష్ణ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ గణపతి

గుడిపాల: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ గణపతి సూచించారు. పాపిశెట్టిపల్లె ప్రభుత్వ పాఠశాల పరిధిలో మంగళవారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధనతో పాటు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. చదువుకు సాయంతో పాటు మధ్యాహ్నభోజనం, విద్యాకానుక కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల రిజిష్టర్, రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రమీల పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని తిమ్మాపల్లె హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం ఆమె తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. వేసవిలో గర్భవతులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, సరళ, శిల్ప, సరిత, శివగామి, కిరణ్ కుమారి పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం

గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా టీటీడీ అనుబంధ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవాన్ని భక్తజన సందడి నడుమ ఆలయ అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఆస్థాన మండపంలో స్వామి వారిని శ్రీదేవి భూదేవి సమేతంగా ప్రత్యేక కళ్యాణ వేదికపై కొలువుదీర్చి, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అర్చక బృందం వేద మంత్రాలు, మేళతాళాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లపై తలంబ్రాలు కురిపించి మహా మంగళహారతులిచ్చారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో కల్యాణోత్సవానికి హాజరయ్యారు. ఆ తరువాత పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్ష దీక్షితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సగం వ్యాధులు దూరం



బాధితులకు కిట్ అందజేస్తున్న మలేరియా అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శుభ్రతతోనే సగం వ్యాధులు దూరమవుతాయని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేట పీహెచ్‌సీలో మంగళవారం బోధకాల బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. ఆ కిట్ ఎలా వా డాలో ప్రయోగాత్మకంగా తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా దోమల ఉధృత్తి ఉంటుందన్నారు. దీని దాటికి పలు రోగాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ముఖ్యంగా బోధకాలు బాధితులు శుభ్రత పాటించాలన్నారు. డాక్టర్ల సలహాల మేరకు మందులు, మాత్రలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చంద్ర మహేష్, ఏపీఎంఓ దయ, సిబ్బంది రామకృష్ణ, నారాయణ, సంతప్‌కుమార్, త్రిలోక్, ఆశలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అమృతం



తవణంపల్లె హైస్కూల్లో మాట్లాడుతున్న డాక్టర్ వినయ్‌కుమార్, సీడీపీఓ నిర్మల



బంగారుపాళెంలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

తవణంపల్లె: గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. స్థానిక హైస్కూల్లో మంగళవారం మండల స్థాయిలో పౌష్టికాహార పక్షోత్సవాలను ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్మల మాట్లాడుతూ తల్లి గర్భధారణ సమయంలో మంచి పౌష్టికాహారంతోపాటు తగినంత విశ్రాంతి తీసుకోవాలన్నారు. మానసికంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండాలని చెప్పారు. తల్లి మానసిక ఆరోగ్యం బిడ్డ ఆరోగ్యం ప్రభావం చూపుతుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ గర్భవతులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు తప్పని సరిగా వాడాలన్నారు. గర్భవతులు ఆసుపత్రిలో ప్రసవించడం మంచిదన్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి మాట్లాడుతూ గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు, మునగాకు భుజించడం మంచిదన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేయించాలని వివరించారు. మండలంలోని 15 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ వర్కర్లు, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

బంగారుపాళెం: గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని ఎంపీపీ అమరావతి అన్నారు. బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో మంగళవారం 'పోషణ్ పఖ్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి, అధిగమించడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఇలాంటి కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పౌష్టికాహార ప్రాముఖ్యం, బాల్యవివాహాలవల్ల కలిగే అనర్థాల గురించి చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్, సీడీపీఓ వాణిశ్రీదేవి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



పూతలపట్టు: సామూహిక సీమంతం చేస్తున్న అధికారులు

పౌష్టికాహారమే అమృతం

కాణిపాకం(పూతలపట్టు): అమ్మ తీసుకునే పౌష్టికాహారమే పిల్లలకు అమృతమని సీడీపీఓ నిర్మల పేర్కొన్నారు. పూతలపట్టు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ – బి, పడాయి–బి కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సరఫరా చేసే పౌష్టికాహారం తప్పక భుజించాలన్నారు. గర్భవతులు తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తినాలని సూచించారు. గర్భిణి నుంచే ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఆరోగ్యానికి, పుట్టబోయే బిడ్డకు మేలన్నారు. అనంతరం వర్కర్లకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, ఏపీఓ సింగన్న, సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కియోస్క్.. హుష్‌కాకి!

- కియోస్క్ సేవలకు మంగళం
- రైతు సేవా కేంద్రాల్లో పీఎంఏఐడీ యాప్
- కొత్తయాప్‌తో అరకొరగా సేవలు



రైతు భరోసా కేంద్రం



రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా కియోస్క్

గుడిపాల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వం అమలుచేసిన పలు సంక్షేమ పథకాలను రద్దుచేయగా, మరి కొన్నింటిని పేర్లు మార్చి అరకొరగా అమలుచేస్తోంది. గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా తీసుకొచ్చిన సచివాలయ, రైతు భరోసా కేంద్రాలను సైతం కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా పయనిస్తోంది. గత ప్రభుత్వం రైతులు ఊరు దాటకుండా అన్ని రకాల సేవలను అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో కియోస్క్‌లను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, పంటలకు మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలను పొందే అవకాశం కల్పించింది. అయితే కూటమి ప్రభు త్వం వచ్చాక రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు నిరుపయోగంగా మారా యి. ప్రభుత్వ సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు సైతం ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. మండల పరిధిలో రైతు సేవా కేంద్రాల్లో 17 కియోస్క్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటిని ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తుండగా మిగిలిన సేవలు రైతులకు అందడం లేదు. అధికారులు మాత్రం వాటిని అన్ని రకాలుగా వినియోగిస్తున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం కియోస్క్‌ల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పూర్తి స్థాయిలో అన్ని విధాలుగా ఆమోదయోగ్యమైన సేవలు అందడం లేదని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం సరికాదని, వాటి ద్వారా సేవలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

సేవలు కొనసాగించాలి

రైతుల సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల సేవలు కొనసాగించాలి. విత్త నాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలుతోపాటు మార్కెటింగ్ సౌ కర్యాలను తెలుసుకునేందుకు అవి ఎంతగానో ఉపయోగపడేవి. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభు త్వం కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనసాగించాలి.


– ఈశ్వర్, రామాపురం

అశ్రద్ధ తగదు

రైతులకు ఎంతగానో ఉపయోగకరమైన కియోస్క్‌లపై అశ్రద్ధ తగదు. చదువులేని రైతులను దృష్టిలో ఉంచుకొని రైతు భరోసా కేంద్రాలను మరింత ఆధునీకరించి కియోస్క్‌లను వినియోగంలోకి తెచ్చి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. గతంలో మాదిరిగానే రైతుభరోసా కేంద్రాల్లోనే అన్నీ వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– మునిరత్నం, వెంగమాంబపురం

బెంగళూరు టు కాశీ.. సైకిల్ యాత్ర



పలమనేరు: 'బీ హ్యాపీ' అనే కాన్సెప్ట్‌తో బెంగళూరుకు చెందిన ముత్తుకుమార్(59) తన స్వస్థలం నుంచి కాశీకి సైకిల్ యాత్ర ప్రారంభించి మంగళవారం పలమనేరుకు చేరారు. ఆయన మాట్లాడుతూ తాను కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాల్లో సైకిల్ యాత్ర చేశానని తెలిపారు. ఈ పర్యాయం 'మనం మరణించేటప్పుడు వెంట ఏమీ రాదు..ఉన్నంత కాలం సంతోషంగా ఉందాం' అనే సందేశంతో సైకిల్ యాత్ర చేస్తున్నట్టు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు – పూతలపట్టు :
95539 55610